## క్లుప్తంగా

### క్రీడల వైపు దృష్టి సారించాలి



యువతకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న చైతన్యకృష్ణ

దెందులూరు : యువత క్రీడల వైపు దృష్టి సారించాలని తద్వారా మానసిక, శారీరక, ఆరోగ్యం లభిస్తుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి చైతన్యకృష్ణ అన్నారు. గురువారం నాగులదేవునిపాడులో అంబేడ్కర్ సెంటర్ వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువతకు క్రికెట్ కిట్లు అందచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుజ్జి గోపాల్, పార్టీ నాయకులు ప్రభు, బుజ్జి బాబురావు ఉన్నారు.

### దెబ్బతిన్న మొక్కజొన్న చేల పరిశీలన



మొక్కజొన్న చేలను పరిశీలిస్తున్న ఏడీఏ పి.లలిత సుధ

ఉంగుటూరు: దెబ్బతిన్న మొక్కజొన్న చేలను ఏలూరు డీఆర్సీ ఏడీఏ పి.లలిత సుధ గురువారం పరిశీలించారు. ఎ.గోకవరం, గొల్లగూడెం, తిమ్మయ్యపాలెం, గోపాలపురం, యర్రమల్లిపాడు గ్రామాల ఆయకట్టుల్లో పరిశీలించారు. మార్చి నెలలో కురిసిన వర్షాలకు ఆయా గ్రామాలలో మొక్కజొన్న పంట 1085 హెక్టార్లల్లో దెబ్బతింది. అనంతరం గొల్లగూడెం ఆర్బీకే సెంటరు వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె వెంట బాలిన వెంకటేష్ తదితరులు ఉన్నారు.

### నష్టపోతున్న ఆక్వారైతులు



ఆక్వారైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆక్వా శాస్త్రవేత్త

గణపవరం: సీడ్, ఫీడ్‌లలో నాణ్యతా ప్రమాణాలు లేక ఆక్వారైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆక్వారైతులకు ప్రభుత్వంతోపాటు, ప్రైవేటు సంస్థలు కూడా రైతులకు అండగా ఉండాలని గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము అన్నారు. గురువారం గణపవరం మండలం అర్ధవరంలో కార్గిల్ ఇండియా ఆధ్వర్యంలో ఆక్వా రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ఆక్వారంగ సమస్యలు, రైతుల ఇబ్బందులు, ఫీడ్, సీడ్, మందులలో నాణ్యతా లోపాలను గురించి వివరించారు. ఆక్వా శాస్త్రవేత్త ఇమ్రాన్, నందకుమార్, కార్గిల్ ఇండియా టెక్నికల్ మేనేజర్ వెంకట్, నవీన్, సుదర్ పాల్గొన్నారు.

### మేనేజ్‌మెంట్ మీట్‌లో సీఆర్ఆర్ విద్యార్థులకు బహుమతులు



మెడల్ సాధించిన సీఆర్ఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులు

పెదపాడు: వట్లూరు సీఆర్ఆర్ ఎంబీఏ విద్యార్థులు రైజ్ రేడియంట్–2023 మేనేజిమెంట్ మీట్‌లో ప్రథమ బహుమతులు సాధించారు. ఇటీవల ప్రకాశం జిల్లాలోని రైజ్ విద్యాసంస్థలు నిర్వహించిన 2023 మేనేజ్‌మెంట్ మీట్‌లో ప్రొడక్ట్ లాంచింగ్, పేపర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చూపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, హెచ్ఓడీ డాక్టరు కేవీ శ్రీధర్, కో- ఆర్డినేటర్లు ఎస్.సతీష్, కవిత అభినందించారు.

### కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు అభినందనలు



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు

ఏలూరు(మెట్రో): జిల్లాల విభజనలో భాగంగా నూతనంగా ఏర్పడిన ఏలూరు జిల్లా సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీఓ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన జిల్లా ఏర్పడి సంవత్సర కాలం విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్‌కు అభినందనలు తెలిపి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సహాయ సహకారాలతో ఏడాది పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్టు చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ ఎన్జీఓ సంఘ నాయకులకు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, నోరి శ్రీనివాస్, మాదాసు సాంబశివరావు, కప్పల సత్యనారాయణ, కేఎస్ఆర్ మోహన్, జి.రవికుమార్, సత్యభారతి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే వాసుబాబు



గణపవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: దేశంలోనే ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ప్రతీ గడపకు వెళ్లి వైద్య సేవలు అందించే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో వైద్య చరిత్రలోనే విప్లవాత్మక మార్పులు తీసుకవచ్చారని, ఈ నిర్ణయం దేశానికే రోల్‌మోడల్ అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గణపవరం వైఎస్సార్ ఇందిరమ్మ కాలనీలో సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో వాసుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న రోగ నివారణ చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. తీవ్రమైన వ్యాధులతో మంచానికి, ఇంటికే పరిమితమైన రోగులకు ఇళ్లకే వైద్యులువచ్చి వైద్యసేవలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజలకోసం ప్రారంభించారని, ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఆరోగ్యకేంద్రాలకు రాలేని వారికి, ఆపరేషన్‌లు చేయించుకుని ఇళ్లవద్దే ఉంటున్న వారికి పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది ఇంటివద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తారని వివరించారు. వైద్యునితో పాటు 104 వాహన సిబ్బంది కూడా వెళ్లి 14 రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయని, అవసరమైన వారికి ఉచితంగా ఇస్తారని చెప్పారు. ఈసందర్భంగా ఆయన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించి, వైద్యులు నిర్వహించిన వైద్య పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గారత్నకుమారి, సర్పంచ్ మూర అలంకారం, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, వైద్యులు పులపర్తి సంతోష్, కిరణ్మయి, ఎంపీడీఓ జ్యోతిర్మయి, తహసీల్దార్ కృష్ణస్వామి పాల్గొన్నారు.

**ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం**

దెందులూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం నాగులదేవునిపాడు రైతు భరోసా కేంద్రంలో గాలాయగూడెం గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రోజాలలిత ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించారు. వైద్యాధికారిణి రోజా లలిత మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాలాయగూడెం సొసైటీ అధ్యక్షుడు తోట అచ్చియ్య, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయపాటి గణేష్, అంబటి లక్ష్మణరావు, పెద్దిశెట్టి బసవయ్య, తోట వెంకన్న, ఎంపీహెచ్ఈఓ నాగరాజు, కార్యకర్తలు ఉన్నారు.

**ప్రజలకు చేరువలో వైద్య సేవలు**

పెదవేగి : అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలకు రాలేని నిస్సహాయులకు ఫ్యామిలీ డాక్టర్ ఓ గొప్ప వరమని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మండలంలోని భోగాపురంలో గురువారం ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి, నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కోసం ప్రతి పీహెచ్‌సీలో ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించిందన్నారు. 104 మొబైల్ యూనిట్‌తో సహా సిబ్బంది డాక్టర్ తోపాటు ఆశ వర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. స్థానిక సర్పంచ్, డాక్టర్ మాధవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**భీమడోలులో..**

భీమడోలు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదల పాలిట వరమని భీమడోలు జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్‌ను జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్‌లు ప్రారంభించారు. భీమడోలు సచివాలయం 3, సచివాలయ 2 పరిధిల్లో అధికారంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండుగొలను వైద్యాధికారి టి.ప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల గోపి, సొసైటీ డైరెక్టర్లు సవలం నాని, కిలపర్తి భాస్కరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు

గణపవరం: ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గణపవరం మండలం చిలకంపాడు జగనన్న కాలనీలో రూ.46 లక్షల వ్యయంతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు, షంపు, పైపులైను నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకట నారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరనాథ్‌రాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తోట కొండయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ జానీ పాల్గొన్నారు.



నాగులదేవునిపాడు ఆర్‌బీకేలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు



భోగాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



ఆర్జావారిగూడెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

### అభివృద్ధి పథంలో భీమడోలు సొసైటీ



భీమడోలు సొసైటీలో చైర్మన్ రావిపాటి సత్యశ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రైతులు

భీమడోలు: భీమడోలు సొసైటీ అభివృద్ధి పథంలో నడుస్తుందని భీమడోలు సొసైటీ చైర్మన్, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. భీమడోలు సొసైటీ వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన మహాజన సభ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సవరంలో సొసైటీ ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలు, వ్యాపార లావా దేవీలు, రైతులకు అందించిన సేవలపై సొసైటీ ఎండీ రామిశెట్టి రాంబాబు నివేదించారు. ఈ సందర్భంగా రావిపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ భీమడోలు సొసైటీలో రూ.18 కోట్ల టర్నోవర్ జరుగుతుందని, 4400 మంది సభ్యులున్నాయని, వాటిలో 1300 మంది రుణ గ్రహీతలున్నాయన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను, రైతు, ఆక్వా రైతులకు మేతకు రుణాలందిస్తున్నామన్నారు. రూ.3.40 కోట్ల ఇన్ బ్యాలెన్స్ ఉందన్నారు. సొసైటీని అభివృద్ధి పథకంలో నడిపిస్తున్న సొసైటీ చైర్మన్ రావిపాటి సత్యశ్రీనివాస్‌ను రైతులు దుశ్శాలువాను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సవలం నాని, కిలపర్తి భాస్కరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, రైతులు సుతాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

### గణపవరం తహసీల్దార్‌గా లక్ష్మి



పీఎస్‌వీఎస్ఎస్ లక్ష్మి

గణపవరం: గణపవరం తహసీల్దార్‌గా పీఎస్‌వీఎస్ఎస్ లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నిడమర్రు మండలం సివిల్ సప్లయిస్ డీటీగా పనిచేస్తూ పదోన్నతిపై గణపవరం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకూ గణపవరం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన కృష్ణస్వామి నిడమర్రు డీటీగా వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మిని కార్యాలయ సిబ్బంది, మండల వీఆర్ఓల సంఘం, రేషన్‌డీలర్ల సంఘం తరపున పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

## వైభవంగా రాట్నాలమ్మ తిరునాళ్ల ప్రారంభం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, ఇతర నాయకులు



విద్యుద్దీపాలంకరణలో కాంతులీనుతున్న అమ్మవారి ఆలయం

పెదవేగి : రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ తిరునాళ్లు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతులమీదుగా కలశ స్థాపనతో అమ్మవారి తిరునాళ్లు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుణ్యాహవచనం, అఖండజ్యోతి ప్రజ్వలన, నవగ్రహ స్థాపన,, కలశస్థాపన కార్యక్రమాలు జరిపారు. ఈ ఉత్సవాలు ఐదు రోజులపాటు నిర్వహించనున్నారు. తొలిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన శ్రీరాట్నాలమ్మ తల్లిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు తరలి వస్తారని చెప్పారు. తొలుత అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులకు చైర్మన్ వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్, పాలకవర్గ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రాత్రి 9 గంటలకు అత్తిలి వారిచే మ్యూజికల్ నైట్, జబర్దస్ రైజింగ్ రాజు, నూకరాజు తమ ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, ఎంపీటీసీ రాగిణి వరదయ్య, దేవస్థాన వైస్ చైర్మన్ గరికిముక్కు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టినట్టు నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ అన్నారు. నగరంలోని తమ్మిలేరు ఏటి గట్టు, కృష్ణా కెనాల్ ప్రాంతాల్లో వ్యాపారులు, ప్రజలు కాలువలో చెత్త, వ్యర్థాలను వేస్తూ కాలుష్యకుహారాలుగా మార్చివేస్తున్న నేపథ్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గురువారం నగర కమిషనర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువల్లో వ్యాపారులు చెత్తను పారవేస్తున్నారని, దీన్ని నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టామని చెప్పారు.

## 'జగనన్నే మా భవిష్యత్' కిట్ల పంపిణీ



దెందులూరులో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని



బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేస్తున్న నేతలు



గుండుగొలనులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

దెందులూరు : జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గ్రామగ్రామాన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు,ఎ పార్టీ నేతలు సమిష్టిగా విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని పిలుపునిచ్చారు. గురువారం మండలంలో పోతునూరు, దోసపాడు, కొవ్వలి, చల్లచింతలపూడి, గోపన్నపాలెం, గాలాయగూడెం, జోగన్నపాలెం, మేధినరావుపాలెం, సానిగూడెం, దెందులూరు, సీతంపేట గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, గ్రామ పార్టీ అధ్యక్షులు పోకల రాంబాబు, సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, జోగన్నపాలెం సొసైటీ అధ్యక్షులు పాకలపాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు నిట్టా గాంధీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**బువ్వనపల్లిలో...**

నిడమర్రు: వైఎస్సార్ సీపీ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. గురువారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు జగనన్నే మా భవిష్యత్ పోస్టర్లను విడుదల చేసారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈనెల 21 వరకూ అన్ని గ్రామ సచివాలయాల్లోని ప్రతీ ఇంటికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తప్పనిసరిగా వెళ్లి వారికి లభించిన లబ్ధిని వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు సంకు శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు షేక్ షరీఫ్ లాల్, బూసాల బాలాజీ, ధనరాజు తదితరులున్నారు.

**భీమడోలులో..**

భీమడోలు: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల ఉజ్వల భవిష్యత్ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేస్తున్న కృషిని ప్రజల చెంతకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలను వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గురువారం జగనన్నే భవిష్యత్– మా నమ్మకం నీవే జగన్ పోస్టర్‌ను ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులతో కలిసి మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ ఆవిష్కరించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, జగన్‌సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ గొటికల మురళీ పాల్గొన్నారు.

**ఉంగుటూరులో..**

ఉంగుటూరు: జగనన్నే మా భవిష్యత్ –మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మరడమంగరావు కోరారు. గురువారం మండలంలోని గ్రామాల సచివాలయాల కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఇంటింటా ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, వీవర్స్ వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్ దొంతంశెట్టి సత్యనారాయణ, పంచాయితీ రాజ్ జిల్లా కన్వీనర్ పుప్పాలగోపి, సొసైటీ అధ్యక్షులు పాపారావు బాబ్జి, వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు మంద జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'గడపగడప'తో ప్రజలకు మరింత చేరువ



చక్రాయిగూడెంలో ఓ మహిళకు ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



తెలుగుదేశం నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారిని పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- చక్రాయిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం
- జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ ఆవిష్కరణ

పెదవేగి: ప్రజలకు మరింత చేరువై సంక్షేమ పాలన అందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం గడపగడపకు మన ప్రభుత్వమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. చక్రాయిగూడెం పంచాయతీలో 121రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యేగా ప్రతి ఇంటికీ ధైర్యంగా వచ్చి ఇలా అడుగుతున్నామని, నాడు చెప్పిన ప్రతి పథకం ప్రజలకు అందుతుందా లేదా అని, ప్రజల ఇబ్బందులు, సమస్యలు అడిగి తెలుసుకుని, ఏఏ విధంగా సంక్షేమ పథకాలు అందాయి, ఎంతమేరకు లబ్ధి చేకూర్చామనే విషయాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలు చేసిన మోసాలను వివరిస్తూ, ఎల్లో మీడియా రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తూ శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు వైఎస్సార్ కుటుంబ సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్' అనే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆవిష్కరించారు.

**వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధికి, దెందులూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై దెందులూరు మండలం సోమవరప్పాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 19 కుటుంబాలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమవరప్పాడు సర్పంచ్ సరిగే నాగరాజు, నాయకులు జితేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో చిట్లూరి సోమయ్య, బాల్లే నాగరాజు, ముక్కెల్లి సత్యనారాయణ, గొటుకుల రాజు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్యకుమార్, సర్పంచ్ సింహాద్రి బేబి, ఈడా ప్రసాద్, ఈడా సూర్యారావు, బోట్ల రామారావురాజబోయిన వెంకట దుర్గారావు, విరమల్లు చిన శ్రీనివాసరావు, వీరంకి ప్రసాద్, బోట్ల శ్రీనివాసరావు, సప్పా మోహనమురళి పాల్గొన్నారు.

### నేడు చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలులో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని, వైఎస్సార్ సీప శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### హోటళ్ల తనిఖీ

దెందులూరు : గోపన్నపాలెం గ్రామంలోని హోటళ్లను గురువారం సాయంత్రం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలు, సంపూర్ణ పారిశుధ్య అమలు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్మీ ప్రాసెసింగ్‌లో భాగంగా ఎలా నిల్వ చేయాలి అనే విషయంపై హోటళ్లలో పనిచేసే సిబ్బంది, యజమానులకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, ఉపసర్పంచ్ హేమసాగర్, కార్యదర్శి యెహోవా ఉన్నారు.

### సచివాలయాల ఆకస్మిక తనిఖీ

కొయ్యలగూడెం: గ్రీవెన్స్ సందర్భంగా వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది సత్వర చర్యలు చేపట్టాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. గురువారం కొయ్యలగూడెం, కన్నాపురం గ్రామాల్లోని పలు సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పాసం నాగమణితో కలిసి రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యల వల్ల లేదా కోర్టు పెండింగ్‌లో ఉన్న సమస్యలు మినహా మిగిలిన అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

### ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఆశావర్కర్లు ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించాలని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో గురువారం ఏలూరు పరిధిలోని ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఆశ వర్కర్లు ప్రజలకు ఆరోగ్య విషయాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉండాలని సూచించారు. తమ పనిలో ఏమైనా సమస్యలుంటే ప్రజా ప్రయోజన సేవల శాశ్వత న్యాయపీఠాన్ని సంప్రదించాలన్నారు. జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మనోరమ,సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు పాల్గొన్నారు.